శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం

- నేటితో గోగన్నమఠం పాఠశాలకు వందేళ్లు
- గురువుల సన్మానానికి ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు



శతాబ్ది ఉత్సవానికి సిద్ధమైన గోగన్నమఠం స్కూల్



అతిథులకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన షీల్డులు

మామిడికుదురు: గోగన్నమఠం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నూరు వసంతాల పండగకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేశారు. శతాబ్ది ఉత్సవాలను శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహిస్తామని కమిటీ శుక్రవారం పేర్కొంది. నూరు వసంతాల వేడుకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పాటు ఇక్కడ చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించాలని కమిటీ నిర్ణయించింది. అతిథులకు షీల్డులతో పాటు పౌర సన్మానం కూడా ఏర్పాటు చేశారు.

1923లో పాఠశాల ఆవిర్భావం..

గోగన్నమఠం గ్రామస్తులు ప్రాథమిక విద్య కోసం ఆరు కిలోమీటర్ల దూరంలోని రాజోలు మండలం పొన్నమండ గ్రామం వెళ్లేవారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అధికారులు 1923 ఏప్రిల్‌లో గోగన్నమఠం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రాథమిక విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం పొన్నమండ వెళ్లేవారు.1999–2000 విద్యా సంవత్సరం నుంచి ఉన్నత విద్యను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ 159 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా బావిశెట్టి నాగేశ్వరరావుతో సహా ఎనిమిది మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



గోగన్నమఠం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నూరేళ్ల పండగ మా హయాంలో జరగడం చాలా ఆనందంగా ఉంది. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో, విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుకుంటున్నారు. పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం ప్రధానమైంది. దాతల సహకారంతో ఈ స్కూల్ దిన దిన ప్రవర్ధమానంగా వెలుగొందింది.

– భూపతిరాజు లక్ష్మి, వైస్ ఎంపీపీ, గోగన్నమఠం

అన్ని వర్గాలకు అందుబాటులోకి..



పూర్వం చదువు కోసం స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. సామాన్యులకు విద్య అందుబాటులో ఉండేది కాదు. ఆరు కిలోమీటర్లు వెళ్లి చదువుకోవడం భారంగా ఉండేది. 1923లో స్కూల్ స్థాపించిన తర్వాత సామాన్యులకు సైతం విద్య అందుబాటులోకి వచ్చింది. అన్ని వర్గాల వారు ఇక్కడ చదువుకుని విద్యావంతులయ్యారు. శతాబ్ది ఉత్సవాలు జరగడం మాకు చాలా ఆనందంగా ఉంది.

– అల్లు విజయలక్ష్మి, సర్పంచ్, గోగన్నమఠం

పండగ వాతావరణంలో ఉత్సవాలు



స్కూల్ శతాబ్ది ఉత్సవాల్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, ఉద్యోగరీత్యా ఎందరో మహానుభావులు గోగన్నమఠానికి గుర్తింపు తీసుకువచ్చారు. గ్రామస్తుల సంపూర్ణ సహకారంతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి.

– సందాడి సూరిబాబు, పీఎంసీ చైర్మన్, గోగన్నమఠం

క్లుప్తంగా

మెడికల్ కోడింగ్‌పై శిక్షణ

మలికిపురం: స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. తెలంగాణకు చెందిన ట్రైనర్ పాజిలత్ షేక్ మాట్లాడుతూ విద్యార్థులకు థాట్ ఫ్లోస్ అనే మెడికల్ కోడింగ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఆర్ టీం సభ్యురాలు దీపిక పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ శిక్షణ అనంతరం వచ్చే ఉద్యోగాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీష్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పేషెంట్స్ మెడికల్ బిల్లుల రూపకల్పన, వాటి భీమా డాక్యుమెంటేషన్ తయారు చేయడమే మెడికల్ కోడింగ్ అని వివరించారు. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, విప్రో టీమ్ లీడ్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్ట్ వద్ద షిర్డీసాయి, సత్యసాయి సేవా మందిరం 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 11 మంది దంపతులతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వాడపల్లి రాంబాబు నేతృత్వంలో స్వామికి కలశారాధన, 121 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, శ్వేతార్క సుంగంధ పరిమళ జలాలు, పవిత్ర వైనతేయ నదీ జలాలతో సంపూర్ణ అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమాల్లో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి చెందాలి

అంబాజీపేట: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి చెందేందుకు ఉచిత చేతి వృత్తి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని విశాఖపట్నంకు చెందిన స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వుగ్గిన శ్రీనివాసరావు, అమలాపురం శ్రీసత్యసాయి సమితి అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు (కొండబాబు), లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుమన్‌వర్మ అన్నారు. అంబాజీపేటలోని శ్రీసత్యసాయి బాబా వారి మందిరంలో 3 నెలల కటింగ్, టైలరింగ్‌లలో ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న 32 మంది మహిళలకు సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న కృష్ణ కుటుంబం

మలికిపురం: గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఉయ్యూరి వారి మెరక గ్రామానికి చెందిన చెల్లుబోయిన కృష్ణ దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారు. శుక్రవారం మలికిపురంలోని ఆలయ కమిటీ సభ్యులకు ఈ మేరకు విరాళం నగదును అందించారు. కార్యక్రమంలో కాకి లక్ష్మణ్, కడలి మురళీకృష్ణ, కంచి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకు పాక దగ్ధం

సఖినేటిపల్లి: స్థానిక పీహెచ్‌సీ వద్ద శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో తాటాకు పాక దగ్ధమైంది. స్థానిక పీహెచ్‌సీకి కొత్త భవనం నిర్మాణ పనుల కోసం ఈ పాక వేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో ధ్వంసం

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం లాకుల సమీపంలోని వంతెన నుంచి ఆటో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆ క్షతగాత్రుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేరని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం మాత్రం పూర్తిగా నుజ్జునుజ్జయింది.

బూత్ కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలి

సఖినేటిపల్లి: బూత్ కమిటీల ద్వారానే పార్టీని బలోపేతం చేసే విధంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అన్నారు. శుక్రవారం వీవీ మెరకలో నియోజకవర్గ కో కన్వీనర్ చెంపాటి శివ రామకృష్ణంరాజు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే బూత్ కమిటీల నియామకం జరిగిందన్నారు. ఈ నెల 30న జరిగే మన్ కీ బాత్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కాగా పార్టీ కో ఆపరేటివ్ సెల్ ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయినవిల్లి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని నేదునూరు, నల్లచెరువు గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేదునూరులో రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు మారుస్తున్నామన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు



చెముడులంకలో గడప గడపలో భాగంగా ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న విప్ జగ్గిరెడ్డి



పోతుకుర్రులో వృద్ధుడికి బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఆలమూరు: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంకలో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి అడుగడుగునా పూల వర్షం కురిపించి నీరాజనాలు పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి, యువనేత గణేష్, సర్పంచ్ తమ్మనకు గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం గడచిన మూడేళ్ల కాలంలో పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతికి నవరత్నాలతో పాటు అదనంగా ప్రవేశపెట్టిన 22 సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి రూ.6.68 కోట్లు అందించినట్లు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, గుణ్ణం రాంబాబు, నాతి కుమార్‌రాజా, నల్లి రాజు, దంగేటి బాపనయ్య, అడబాల వీర్రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, దొండపాటి వీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పాలనలో అన్నీ మంచి శకునాలే..

అయినవిల్లి: సీఎం జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్ని మంచి శకునాలేనని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. శుక్రవారం అయినవిల్లి మండలం పోతుకుర్రులో స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మనప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం నియోజకవర్గ అబ్జర్వర్ కర్నాసుల సీతారామాంజనేయులు గడపలకు తిరిగి గ్రామస్తులను ప్రభుత్వ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రావు, చిలువూరి నరసింహరాజు, వార జయసావిత్రి, యడ్ల కిరణ్‌బాబు, కమిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పుల్లంశెట్టి, దాసరి రాంబాబు, వాసంశెట్టి సత్తిబాబు, బొక్కా సువర్ణరాజు తదితరులు ఉన్నారు.

నూకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అంబాజీపేటలో మాట్లాడుతున్న ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: చేను ఎండిపోయి వరి కర్ర పచ్చిగా లేకపోతే ధాన్యం గింజలు నూకలుగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి రైతు పంట కోసే సమయంలో నేలలో కొద్దిగా తేమ, వరి కర్రలో పచ్చిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలకు, వీపీఏలకు, వీహెచ్‌ఏలకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ వరి చేనును పూర్తిగా ఎండిపోయే వరకు చేనుపై ఉంచకుండా రైతులను చైతన్య పరచాలన్నారు. కోసిన పంటను తక్షణమే ఆర్బీకేలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం తగ్గాలనే ఉద్దేశంతో ఆలస్యంగా కోయడం, అధిక ఉష్ణోగ్రతల వద్ద ఆరబెడితే ధాన్యం మిల్లింగ్‌లో నూక ఎక్కువగా వచ్చే అవకాశం ఉందనే విషయాన్ని రైతులకు వివరించాలన్నారు.తహసీల్దార్ టి.మంగతాయారు, ఏఓలు ఆయన వెంట ఉన్నారు.

పి.గన్నవరం: రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలు, ఆర్‌బీకే కేంద్రాల సిబ్బందితో పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ ముక్కంటి మాట్లాడుతూ ధాన్యం పట్టుబడికి సంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల వద్దకు వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. వర్షాలు వస్తే పంటలకు నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. జి.పెదపూడిలో రైతులకు సంచుల కొరత రావడంతో సంబంధిత ఆర్‌కే రైస్ మిల్లు యజమానిని పిలిపించి ఆర్డీఓ మాట్లాడారు. తక్షణమే నాలుగు వేల సంచులను రైతులకు అందించాలని ఆర్డీఓ ఆదేశించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్, డీటీ బి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వెంబడించి పుస్తెల తాడు చోరీ

మామిడికుదురు: రాత్రి సమయంలో బైక్‌పై వెళ్తున్న దంపతులను వెంబడించి మహిళ మెడలోని బంగారం పుస్తెల తాడు అపహరించిన ఘటన పాశర్లపూడిలంకలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బైక్ వెనుక కూర్చున్న పాశర్లపూడిలంకకు చెందిన మేడిద వరలక్ష్మి మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆమె భర్త సూర్యనారాయణతో కలసి గురువారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఉన్న బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లింది. ఇంటి నుంచి బైక్‌పై పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌కు వెళ్లి అక్కడ బండి పెట్టి ఇద్దరూ బస్సుపై పాలకొల్లు వెళ్లారు. తిరిగి రాత్రి బైక్ వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న సూర్యనారాయణ దగ్గరకు బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మించాడు. తనకు బైక్ ఉందని చెప్పి ఇద్దరూ బైక్‌పై ఇంటికి బయలు దేరారు. వీరిని వెనుకే వెంబడిస్తూ వెళ్లిన ఆ వ్యక్తులు దంపతుల ఇంటికి సమీపాన నిర్జన ప్రదేశంలో వరలక్ష్మి మెడలోని పుస్తెలతాడును లాక్కుని పరారయ్యారు. దీనిపై బాధితుల ఫిర్యాదు తో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. గత నెలలో జరిగిన చోరీ, ఇప్పటి చోరీకి పోలికలు ఉండటంతో ఈ చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు.

బాధ్యతగా సేవలు అందిస్తే గుర్తింపు

రాజోలు: బాధ్యతగా సేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందుకున్న ముంగండ విజయశ్రీని శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండల ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాడు–నేడు పనులను విజయవంతంగా పూర్తి చేయడంతో ఎంఈఓ ఎంతో కృషి చేశారన్నారు. ఎంఈఓ దంపతులు రవిబాబు, విజయశ్రీలను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయిని ఎం.సుహాసిని, తహసీల్దార్ బి.ముక్తేశ్వరరావు, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి స్వామి వార్ల కల్యాణం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి, జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో వేంచేసిన రమాసత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాలు వచ్చేనెల ఒకటి నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో బి.కృష్ణచైతన్య పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సీతమ్మ సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: నిరతాన్నదాత్రి డొక్కా సీతమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో శుక్రవారం సీతమ్మ వర్ధంతిని మండల బీజేపీ ఉపాధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతమ్మ విగ్రహానికి వేమా తదితర నాయకులు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు అడబాల సత్యనారాయణ, చీకరమెల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రోటరీ చేయూత

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామం పెదతిప్ప ప్రభుత్వం పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మలికిపురం రోటరీ క్లబ్ బృందం పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, మేథ్స్ పరికరాలు బహూకరించారు. మండల వ్యవసాయ కమిటీ సలహా చైర్మన్ నల్లి శివకుమార్, హెచ్‌ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణకుమారి, నల్లి రాజేంద్ర, నల్లి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

కొత్తపేట: మండలంలోని వాడపాలెం సందీప్ చారిటబుల్ ట్రస్ట్ సేవా భవనం వద్ద ఈ నెల 30న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన కుమారుడు, దివంగత వైద్య విద్యార్థి బండారు సందీప్ స్మృతిలో చిట్టిబాబు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సందీప్ జయంతి పురస్కరించుకుని మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధిగ్రస్తులు, అనారోగ్య అనుమానితులు ఈ శిబిరానికి వచ్చి ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పి.గన్నవరం: తాటికాయలవారి పాలెం వద్ద ఈనెల 26 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. బోడపాటివారిపాలెం గ్రామానికి చెందిన నందపునీడి సీతారామయ్య (75) ఈనెల 26వ తేదీ రాత్రి పి.గన్నవరం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన యువకుడు పల్సర్ బైక్‌పై వేగంగా వెళ్తూ సీతారామయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను కాకినాడలోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. యువకుడు చికిత్స పొందుతుండగా, సీతారామయ్య శుక్రవారం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మోహన్ సతీమణిని కలసిన గణేష్

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ జక్కంపూడి గణేష్, రీజనల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి దివంగత మిండగుదిటి మోహన్ సతీమణి శ్రీలక్ష్మి మంగాదేవి, మోహన్ తనయుడు పార్టీ కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ శిరీష్ నారాయణస్వామి (శిరీష్)ని కలిశారు. తొలుత మోహన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరి వెంట కటకంశెట్టి ఆదిత్య, సూదాబత్తుల రాము, నల్లా అజయ్, తులా గోపాలకృష్ణ, మేడిశెట్టి రాజా, మిండగుదిటి రాంబాబు, మిండగుదిటి చిన్ని, తదితరులు ఉన్నారు.

భవిత బాలలపై సహృదయం అభినందనీయం

కొత్తపేట: స్థానిక భవిత సెంటర్‌లో మానసిక దివ్యాంగులపై దాత గొలకోటి వెంకటసత్యనారాయణ సహృదయం, సేవా దృక్పథం అభినందనీయమని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలేనికి చెందిన గొలకోటి జగన్మోహన్‌రావు–సత్యవతి దంపతుల కుమారుడు వెంకట సత్యనారాయణ స్థానిక గౌతమినగర్ పాఠశాల భవిత కేంద్రానికి రూ.15 వేలు విలువ చేసే బోధనోపకరణాలు, ఆట వస్తువులు సమకూర్చారు. వాటిని శుక్రవారం ఎంఈఓ హరిప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. దాత సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాలల తల్లిదండ్రులు సహనం, ఓర్పుతో భవిత సెంటర్‌కు తీసుకువచ్చి వారి మానసిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.సుభాష్‌చంద్రబోస్, సెంటర్ ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, హెల్పర్ దుర్గ, బీసీ యువజన నాయకుడు మట్టపర్తి జితేంద్రకుమార్, గంగుమళ్ల రాజు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు ఉద్బోధించారు. రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ సంస్థ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన గోదావరి తెలుగు ప్రతిభా పరీక్షలో స్థానిక విద్యాబాల మందిర్ విద్యార్థులు పలు పోటీల్లో ర్యాంకులు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనూరాధ తెలిపారు. విజేతలకు సంస్థ పంపిన మెమెంటో, మెడల్, సర్టిఫికెట్లను డేవిడ్ చేతుల మీదుగా అందజేశారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



అంతర్వేదిలో తాగునీటి ప్రాజెక్టు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

సఖినేటిపల్లి: రాజోలు దీవిలోని సముద్రతీర గ్రామాల్లో తాగునీటి సమస్యకు సీఎం జగన్ ద్వారా శాశ్వత పరిష్కారం లభించిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని అంతర్వేది దేవస్థానంలో అంతర్వేది ప్రధాన చెరువును రూ.17.33 కోట్లతో అభివృద్ధి చేసి ప్రజలకు తాగునీటిని అందించే పనులకు శుక్రవారం ఎమ్మెల్యే రాపాక భూమి పూజ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ అంతర్వేదిలో తాగునీటి ప్రాజెక్టు ప్రక్రియ సుమారు 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు ఇక్కడి తాగునీటి సమస్యలను గాలికి వదిలేశాయన్నారు. పూర్తిగా ఉప్పునీటి మయమైన తీర గ్రామాల తాగునీటి కోసం అడిగిన వెంటనే సీఎం జగన్ నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే అన్నారు. జల్‌జీవన్ ద్వారా జరుగుతున్న ఈ ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది వరమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, బల్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ నాయకులు కేఎస్‌ఎన్ రాజు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు

మామిడికుదురు: కోనసీమ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా పాశర్లపూడి–బోడసకుర్రు గ్రామాల మధ్య వైనతేయ వారధిపై చేపట్టిన రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాశర్లపూడిబాడవ వైపు పిల్లర్ల నిర్మాణం పనుల్ని ఇటీవల ప్రారంభించారు. ఇటు వైపు మొత్తం అయిదు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. వాటిలో నది ఒడ్డున మూడు పిల్లర్లు, నదిలో రెండు ఫిల్లర్ల నిర్మాణం పనుల్ని ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణంలో మొత్తం 21 పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. దీనిలో భాగంగా బోడసకుర్రు వైపు నది ఒడ్డున అయిదు పిల్లర్లు నిర్మించారు. గోదావరి నదిలో 11 పిల్లర్లు నిర్మిస్తున్నారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అటు వైపు మొత్తం 16 పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. అటు వైపు పిల్లర్ల నిర్మాణం పనులు చివరి దశకు చేరుకోవడంతో పాశర్లపూడిబాడవ వైపు పనులకు శ్రీకారం చుట్టారు. నాలుగేళ్ల క్రితం రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కోనసీమ వాసుల చిరకాలం వాంఛ నెరవేర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పథకంలో మార్పుల్ని రద్దు చేయాలి

సఖినేటిపల్లి: ఉపాధి హామీ పథకంలో కేంద్రం తెచ్చిన మార్పులను తక్షణం రద్దు చేయాలని నియోజకవర్గ ఉపాధి కూలీల సంఘ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మోరిపోడులో సీనియర్ మేట్ లంకే తాతరాజు అధ్యక్షతన కూలీల సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఇటీవల సాంకేతిక మార్పులను తీసుకురావడం వల్ల ఉపాధి కూలీలు నష్టపోతున్నారన్నారు. పథకంలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం, నేషనల్ ఇన్ఫార్మాటిక్ సాఫ్ట్‌వేర్ వల్ల ఉపాధి కూలీలు పనిదినాలు కోల్పోతున్నారన్నారు. పనిప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని, మజ్జిగ సదుపాయం కల్పించాలని, ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని వంటి తీర్మానాలను సమావేశంలో చేశారు. మేట్స్ కుసుమ రమేష్, మల్లాడి రమాదేవి, రాపాక ధర్మారావు, గెడ్డం దేవి పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు

అంబాజీపేట: కౌలు రైతులను తక్షణమే గుర్తించి కార్డులు మంజూరు చేయడమే కాకుండా వారికి రుణాలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి (ఏవో) సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయంలో డీసీసీబీ బ్యాంకు, వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన కౌలు కార్డులు, రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతుల యొక్క ఆదాయం పెంపొందించేందుకు సకాలంలో రుణాలు అందించడమే లక్ష్యమన్నారు. 10 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. కౌలు రైతులకు రుణాలను అందించేందుకుగాను మాచవరం గ్రామం పైలెట్ గ్రామంగా ఎంపికైందన్నారు. కౌలు రైతులకు గరిష్ఠంగా రూ.లక్ష రుణాలు ఇవ్వనున్నారన్నారు. తీసుకున్న రుణాన్ని తిరిగి 11 నెల్లో చెల్లించాలన్నారు. కౌలు రైతులను వ్యవసాయ నిర్దేతలుగా గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ రవితేజ, డీటీ పీఎస్‌పీ లక్ష్మి, వీఆర్వో రమేష్, వీపీఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

దమ్ము గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపేట: నియోజకవర్గంలో 'దమ్ము' గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక టీడీపీ నాయకులు కాలక్షేపం కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి స్థానిక శిథిలమైన తహశీల్దార్ భవనం ఆధునీకరించే సత్తా, దమ్ముందా? అని పలు పత్రికలు, సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు తెలిపారు. దానిపై వారు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం ప్రజల్లోకి వెళ్లే సత్తా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. నియోజకవర్గ చరిత్రలో దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాత్రమేనని అన్నారు. దమ్ముంది కాబట్టే జగ్గిరెడ్డి కొత్తపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్ సాధించుకొచ్చారన్నారు. కొత్తపేటకు ల్యాండ్ మార్కుగా బ్రిటిష్ కట్టడం అయిన పూర్వపు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు జగ్గిరెడ్డి కృషితో రూ.14 లక్షలు మంజూరయ్యాయని, అయితే ఈలోపు రెవెన్యూ డివిజన్ రావడంతో ఆర్డీఓ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు అనువుగా నిర్మించాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన మరుక్షణం నుంచీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గడప గడపకూ వెళ్లి ఇంకా సమస్యలేమైనా ఉన్నాయా? అని పలకరించే దమ్ము మాకుంది. మీకు ఉందా? అని ప్రశ్నించారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి ఆక్సిజన్, మందుల కిట్లు సరఫరా చేసిన ధైర్యశాలి మా నాయకుడని అన్నారు. కళ్లు లేని కబోదుల్లా కాకుండా కళ్లు తెరిచి మాట్లాడాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, యువజన విభాగం సభ్యుడు బెజవాడ నారాయణరావు, గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.